



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 108

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 3 సెప్టెంబరు 2025


## ఎరువుల సరఫరాపై రైతులు ఆందోళన పడొద్దు

● యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు ● మార్క్ ఫెడ్ ద్వారా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు ● గత ఏడాదితో పోలిస్తే 91 వేల మెట్రిక్ టన్నుల అదనంగా యూరియా సరఫరా ● రసాయన ఎరువుల వినియోగంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి ● తక్కువ మొత్తంలో ఎరువులు, పురుగుమందుల వాడే రైతులకు సబ్సిడీలు ● కాఫీ తోటల తెగుళ్లపై తక్షణం చర్యలు చేపట్టాలి ● ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డిమాండ్ కంటే అదనంగానే నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలి పోకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఇ-క్రాప్ ద్వారా రాష్ట్రంలో ఎంత మేర ఏ పంటలు సాగు అవుతున్నాయి. ఎరువుల వినియోగం ఎంత జరుగుతుందన్న లెక్కలు తీయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 2.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయ్యిందని.. వాస్తవ డిమాండ్ కంటే అదనంగా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించారు. గతంతో పోలిస్తే ఈసారి 91 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా వచ్చినట్టు తెలిపారు. ఇక డీఏపీ 51,700 మెట్రిక్ టన్నుల మేర వచ్చిందని.. గత ఏడాదితో పోలిస్తే 16 వేల మెట్రిక్ టన్నులు ఇది అదనమని అధికారులు సీఎంకు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు కూడా ప్రస్తుత ఏడాదిలో 2.72 లక్షల మెట్రిక్ టన్నుల మేర వచ్చిందని వివరించారు. గతంతో పోలిస్తే 1.20 లక్షల మెట్రిక్ టన్నులు ఇది అదనమని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం రాష్ట్రంలో ఎరువుల లభ్యత ఇంతగా ఉన్నా.. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని.. ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా యూరియా వినియోగం కూడా లెక్కించాలని అన్నారు.

**రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గితే సబ్సిడీలు..** రసాయన ఎరువులు, పురుగు మందుల రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు వాటి వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించిన రైతులకు రాయితీలు ఇచ్చే అంశంపై ప్రణాళికలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఎంత వినియోగిస్తున్నారనే అంశాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువుల వినియోగంపై గణాంకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**11 ఉద్యాన పంటలకు సాగు ధర దక్కాలి..** రాష్ట్రంలోని 11 ఉద్యాన పంటలకు సంబంధించి సాగు వ్యయానికి తగినట్టే ఆయా పంటలకు కనీస ధర వచ్చేలా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్ట పోవడానికి వీల్లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మరోవైపు కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన బోరర్ తెగులు పై తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కొత్త తెగులు వచ్చిన కాఫీ పంట 20 ఎకరాల్లో ఉందని...దానిని తక్షణం తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇతర ప్రాంతాలకు తెగులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. అలాగే తొలగించిన పంటకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే మూడేళ్ల పాటు ట్రాప్ లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. మరోవైపు ఉల్లి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాల్సిందిగా అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ఉల్లిని స్థానికంగా కమ్యూనిటి హాళ్లను తీసుకుని ఆరబెట్టాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఇప్పటి వరకూ హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి రూ.54 కోట్ల రూపాయలను చెల్లింపులు జరిగాయని .. మరో రూ.59 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అలాగే 5 వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ కె.విజయానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తిని కొనసాగిస్తాం

● రైతులకు ఉచిత విద్యుత్ తో వైఎస్ఆర్ చెరగని ముద్ర వేశారు
● యువ, కొత్త ఎమ్మెల్యేలను ప్రోత్సహించడంలో వైఎస్ఆర్ ఎప్పుడూ ముందుండేవారు ● ఫ్లోరైడ్ వల్ల జీవించలేని పరిస్థితులు ఉన్న నల్గొండ జిల్లాను మార్చాలని వైఎస్ఆర్ భావించారు



**హైదరాబాద్,కలంకౌంటర్ :** వ్యవసాయం దండగ కాదు పండగ చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ఆర్ సంకల్పించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని హెూటల్ దసపల్లాలో వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరైయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుభాష్ పాలేకర్, డాక్టర్ సి.నాగేశ్వరరావు, సి.పద్మకు వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డును అందించారు. కొంతమంది మీకు కేవీపీ రామచంద్రరావును అవుతానని తనతో అంటారని, కానీ ఈ తరానికి ఒకే వైఎస్ఆర్, ఒకే కేవీపీ ఉంటారని వాళ్లతో తాను చెప్తుంటానని సీఎం రేవంత్ తెలిపారు. జీవితాంతం ఒక మిత్రుడికి తోడుగా ఉండి అన్నీ చేసిపెట్టడం గొప్ప విషయమన్న సీఎం కేవీపీ కావడం అంత తేలికైన విషయం కాదన్నారు. ఎవరూ అలా ట్రై చేయొద్దని, కొంచెం పక్కకు జరిగితే ఆ సీట్లో కూర్చోవడానికే ప్రయత్నించేవాళ్లు ఎక్కువ ఉన్నారని చమత్కరించారు. ఇవాళ ఉచిత విద్యుత్‌ను ఎవరు ఇచ్చినా వైఎస్ఆర్‌నే గుర్తుకు తెచ్చుకుంటారని, భవిష్యత్‌లోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తిని ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు.

**3 నెలల్లోనే రైతులకు రుణమాఫీన అమలు :** రూపాయికి కిలో బియ్యం స్థానంలో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రైతులకు రుణమాఫీని అమలు చేశామని, రుణమాఫీ కింద 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లు జమ చేశామని సీఎం రేవంత్ తెలిపారు. రసాయన ఎరువుల కొనుగోలు రూపంలో మన లక్షల కోట్ల సంపద విదేశాలకు వెళ్తోందని, మన సంపద విదేశాలకు వెళ్లొద్దు అంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తిగా తీసు కుని రైతులు సేంద్రీయ ఎరువును అను- సరించాలని అన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత- చేవెళ్ల నిర్మించి రంగారెడ్డి జిల్లాకు నీరు ఇవ్వా లని వైఎస్ఆర్ సంకల్పించారని, గత ప్రభుత్వం ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రంగారెడ్డి జిల్లాలను నిర్వీర్యం చేసిందని ఆక్షేపించారు.

**తాగు, సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ :** ఫ్లోరైడ్ వల్ల జీవించలేని పరిస్థితులు ఉన్న నల్గొండ జిల్లాను మార్చాలని వైఎస్ఆర్ భావించారని, తాగు, సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పక్కకు పెట్టిందని, పదేళ్లు పనులు ఆగిపోవడంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే తనకు మిగిలి ఉన్న ఏకైక కోరిక అని వైఎస్ఆర్ అనేవారని, యువ, కొత్త ఎమ్మెల్యేలను ప్రోత్సహించడంలో వైఎస్ఆర్ ఎప్పుడూ ముందుండేవారని తెలిపారు. వైఎస్ఆర్ అసంపూర్తిగా వదిలివేసిన స్ఫూర్తిని తాము కొనసాగిస్తామని రేవంత్ రెడ్డి అన్నారు.

## గతంతో పోల్చితే తగ్గిన విద్యుత్ కొనుగోళ్లు

● విద్యుత్ డిమాండ్ కు తగినట్లుగా ఉత్పత్తి ● ఉత్పత్తికి తగిన బొగ్గు నిల్వలు సమకూర్చుకోండి
● జెన్కో ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం ● జెన్కో సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,కలంకౌంటర్ ::** గృహ, పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగాలని, జెన్కో ప్లాంట్లలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఏపీ జెన్ కో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం లోని మూడు థర్మల్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి, రోజువారీ విద్యుత్ కొనుగోళ్లు పై ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగానికి తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. అంతేగాకుండా గతంతో పోల్చితే రోజు వారి విద్యుత్ కొనుగోళ్లు తగ్గినట్లు తెలిపారు. ఏపీ జెన్కో%-%ఏపీపీడీసీఎల్ సంయుక్తంగా 2025 ఆగస్టు వరకు 16,000 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించిన విషయాన్ని ఈ మేరకు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 20.3 శాతం వృద్ధి సాధించామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయడంపై మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాల్లో తొలిసారి శ్రీశైలం హైడల్ పవర్ స్టేషన్ 1,000 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరడంపై అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక పాలనలో ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక విద్యుత్ రంగం అభివృద్ధిలో ముందంజ వేస్తోందని పేర్కొన్నారు. కేవలం ఏడాది కాలంలోనే జల విద్యుత్ ఉత్పత్తి 36% మేర ఉత్పత్తి సాధించడం భవిష్యత్తు అవసరాలను తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## దేశంలోనే తొలిసారిగా... సీకే దిన్నె పాఠశాలలో స్మార్ట్ కిచెన్ ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

● రూ.2 కోట్ల వ్యయంతో 136 పాఠశాలలకు నాణ్యమైన భోజనం ● డిసెంబర్ నాటికి జిల్లాలో 33 కిచెన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి ● పనితీరును బట్టి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్న మంత్రి
● విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న లోకేశ్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో సరికొత్త శకం మొదలైంది. దేశంలోనే తొలిసారిగా కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గంలోని సీకే దిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పూర్తి సౌరశక్తితో పనిచేసే 'సెంట్రలైజ్డ్ అడ్వాన్స్‌డ్ స్మార్ట్ కిచెన్'ను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక వంటశాల ద్వారా వేలాది మంది విద్యార్థులకు పరిశుభ్రమైన, రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా సీకే దిన్నెతో పాటు కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, కడపలో ఒకటి... మొత్తం ఐదు స్మార్ట్ కిచెన్‌లను మంత్రి లోకేశ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద ఈ ఐదు వంటశాలల ద్వారా 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన 13 వాహనాల ద్వారా ఆహారాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారు. ఈ వాహనాలను, వంట కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్వో ప్లాంట్‌ను కూడా మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. న్యూట్రిషనిస్ట్ పర్యవేక్షణలో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో, ఆర్వో నీటిని మాత్రమే ఉపయోగిస్తూ ఇక్కడ వంట చేస్తారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రుచి, శుచితో కూడిన భోజనాన్ని నిర్దేశిత సమయానికి అందిస్తామని సిబ్బంది మంత్రికి వివరించారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం: మంత్రి లోకేశ్..** ఈ కార్యక్రమం పనితీరును సమీక్షించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసే ఆలోచన ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "సీకే దిన్నె స్మార్ట్ కిచెన్ ఒక పైలట్ ప్రాజెక్ట్. దీని పనితీరును నిశితంగా పరిశీలిస్తాం. తల్లిదండ్రుల నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుని, అవసరమైన మార్పులు చేసి మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి కడప

- 4లో

## అమరజీవి కాంస్య విగ్రహం ఏర్పాటు పట్ల హర్షం

### -ఏపీ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం

**విజయవాడ,కలంకౌంటర్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి నారాలోకేష్ చేతుల మీదగా శంకుస్థాపన చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సేవా సంఘం తరపున ఏపీ రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ రవికుమార్,కో కన్వీనర్లు భవిరిశెట్టి రామారావు,ఓబుల శెట్టి రాధాకృష్ణ, డాక్టర్ చక్కా వెంకట కేశవరావు,జి శ్రీనివాస్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్టుల అసోసియేషన్ కన్వీనర్ రవికుమార్,కో కన్వీనర్ దేవతి భగవాన్ నారాయణ లు మాట్లాడుతూ అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేయడం అమరజీవికి దక్కిన గౌరవం అని అన్నారు. స్మృతి వనం ఏర్పాటు చేయటానికి స్థలం కేటాయించి సహకరిస్తున్న కూటమి ప్రభుత్వానికి జర్నలిస్టు అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.



# ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్

- తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ
- జల, వాయు, రోడ్డు, రైలు మార్గాలను అనుసంధానించేలా ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ సిస్టం
- విశాఖలో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, కలంకౌంటర్:** తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణా, మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక తదితర రాష్ట్రాల హింటర్ ల్యాండ్ కార్గోను కూడా ఏపీ పోర్టుల ద్వారా రవాణా చేసేలా కార్యాచరణ చేపడుతున్నామని వివరించారు. మంగళవారం విశాఖలో జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్ కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీని లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపడుతున్నామని సీఎం స్పష్టం చేశారు. ఈస్ట్ కోస్ట్ గేట్ వేగా ఏపీ అత్యుత్తమ ప్రదేశమని అన్నారు. సదస్సు కంటే ముందు మారిటైమ్ లాజిస్టిక్స్ అభివృద్ధిపై దేశవ్యాప్తంగా వివిధ పోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ కంపెనీలకు చెందిన 62 మంది సీఈఓలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో మారిటైమ్ లాజిస్టిక్స్ రంగంలో ఉన్న అవకాశాలు, పోర్టు కార్గో హ్యాండ్లింగ్ లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్డు, రైలు కనెక్టివిటీ, ఓడరేవుల్లో టెర్మినల్స్ ఆధునీకరణ, షిప్ బిల్డింగ్, మారిటైమ్ లాజిస్టిక్స్ లో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ప్రమాణాలతో పాటు వివిధ అంశాలను ప్రతిపాదించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ పోర్టుల ద్వారా 69 మిలియన్ టన్నుల మేర ఇనుప ఖనిజం, 11 మిలియన్ టన్నుల బొగ్గు, 5.5 మిలియన్ టన్నుల ఎరువుల రవాణా జరుగుతోందని సీఎం తెలిపారు. బల్క్ కార్గో రవాణాకు భారీ నౌకలు రాకపోకలు సాగించేలా 18 మీటర్ల లోతైన ఓడరేవులు తూర్పుతీరంలో ఏపీ మినహా మరెక్కడా లేవన్నారు. సముద్ర రవాణా పరంగా ఏపీ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. పోర్టులకు అనుసంధానంగా మూడు పారిశ్రామిక కారిడార్లు కూడా ఏపీలో ఉన్నాయని తెలిపారు. పొరుగు రాష్ట్రం తెలంగాణా డ్రైపోర్టును ఏర్పాటు చేసి మచిలీపట్నం పోర్టు ద్వారా కార్గో రవాణా చేయాలని భావిస్తోందని అన్నారు. గోదావరి నది ద్వారా అంతర్గత జల రవాణా మార్గాలతో మహారాష్ట్ర, కర్ణాటక కూడా ఏపీలోని కొన్ని పోర్టుల ద్వారా సరకు రవాణా చేయాలని భావిస్తున్నట్టు సీఎం స్పష్టం చేశారు. ఇవన్నీ ఏపీకి ఉన్న సానుకూలతలని తెలిపారు.

**ప్రతీ పోర్టుకు కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్..** పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైలు మార్గాలను అనుసంధానించి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థను రూపొందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీటితో పాటు అంతర్గత జలరవాణా మార్గాలను కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. గోదావరి, కృష్ణా నదుల ప్రవాహ మార్గాల్లో దాదాపు 1500 కిలోమీటర్ల మేర జల రవాణా మార్గాలను వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కాకినాడ-చెన్నై మధ్య పురాతనమైన బకింగ్ హామ్ కెనాల్ రవాణా మార్గాన్ని పునరుద్దరిస్తామని సీఎం తెలిపారు. ఈ రవాణా మార్గాలను అనుసంధానించటం ద్వారా అతి తక్కువ రవాణా వ్యయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆపరేషనల్ గా ఉన్న పోర్టులు, కొత్తగా అందుబాటులోకి రానున్న పోర్టులతో రహదారులు, రైలు మార్గాలు, అంతర్గత జలరవాణా, ఎయిర్ కార్గో మార్గాలను అనుసంధానించేలా ప్రతీ పోర్టుకు కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని సీఎం వెల్లడించారు. రవాణా పరమైన అంశాలను నిర్వహించేందుకు వీలుగా ఏపీలో త్వరలోనే లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తక్కువ వ్యయంతోనే రైలు, రోడ్డు మార్గాలను పోర్టులకు అనుసంధానించే అవకాశం ఉందని తెలిపారు.

**పోర్టు ఆధారిత ఆర్ధిక వ్యవస్థ..** పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక కార్యకలాపాలతో పాటు టౌన్ షిప్ లను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం వివరించారు. మూలపేట, మచిలీపట్నం, కాకినాడ, రామాయపట్నం ఇలా వివిధ పోర్టుల వద్ద పరిశ్రమల ఏర్పాటు, టౌన్ షిప్ ల కోసం 10 వేల ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉందన్నారు. ఆర్ధిక వ్యవస్థతో పాటు ఈ రంగాల్లో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యేలా లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీలు కూడా త్వరలో ఏర్పాటు అవుతాయని సీఎం తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి సహా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి ఎయిర్ కార్గో రవాణాకు కూడా అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మొత్తంగా జీఎస్డీపీలో లాజిస్టిక్స్ రంగం 3 శాతానికి పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. దుగరాజపట్నం సహా వివిధ ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్లు, మరమ్మత్తులు, కంటైనర్లు, షిప్ రీసైక్లింగ్ లాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశమున్నదని సీఎం స్పష్టం చేశారు. మారిటైమ్ లాజిస్టిక్స్ కు సంబంధించి 15-20 మంది పారిశ్రామిక వేత్తలతో కూడిన సలహా బోర్డును కూడా ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతకు ముందు మారిటైమ్ రంగంలోని ఆరు స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ను సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, డీబీవీ స్వామి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఆ సంస్థ అధికారులు, జీఎఫ్ఎస్టీ వైస్ ఛైర్మన్ ఎస్.పి. టక్కర్ తదితరులు హాజరయ్యారు.

## వెండి నాగ పడిమ బహుకరణ



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విజయవాడ .కు చెందిన జి.ఎం.ఎల్. శాస్త్రి - నీలిమ దంపతులు భక్తిశ్రద్ధలతో వెండి నాగపడగ 630 గ్రాములు (విలువ సుమారు రూ. 90,000/-)ను ఆలయ సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ ఆలయ అధికారులు తోట చెన్నకేశవకి అందజేసారు. అనంతరం దాతలను దేవస్థానం అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

## చంద్రగ్రహణం సందర్భంగా 7 న ఆలయం మిసివేత



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాన్ని సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం, మధ్యాహ్నం 12:30 గంటలకు చంద్రగ్రహణం సందర్భంగా మిసి వేయబడును అని ఆలయ డిప్యూటీ కమిషనర్ %ం% ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. చంద్రగ్రహణం ముగిసిన మరుసటి రోజు ఉదయం ఆలయంలో పుణ్యాహవాచనం నిర్వహించి, ఉదయం 10:00 గంటల నుంచి భక్తులకు స్వామివారి సర్వదర్శన భాగ్యం కల్పించబడును అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు భక్తులు ఈ విషయాన్ని గమనించి, తగిన విధంగా ఆలయ దర్శన ఏర్పాట్లు వినియోగించుకోవాలని కోరారు.

## వైయస్ చిత్రపటానికి పూలమాల వేసిన సింహాద్రి రమేష్ బాబు



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి ప్రధాన సెంటర్ నందు దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు.. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు రైతే రాజు అంటూ పరిపాలన కొనసాగించిన దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి అని మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మోపిదేవి మండలం అధ్యక్షులు గరికపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబం నుండి ఉపాధ్యాయురాలిగా ఎంపికైన గుండిబిల్లి రాణి.



**గోకవరం (తూర్పు గోదావరి జిల్లా),కలంకౌంటర్ :** గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే రైతు గుండిబిల్లి సూరిబాబు కుమార్తె గుండి బిల్లి రాణి తాజాగా జరిగిన డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా ఎంపికయింది. ఒకపక్క పెళ్లి చేసుకుని గృహిణి గా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఉపాధ్యాయురాలు, కావాలనేటటువంటి దృఢ సంకల్పంతో అహర్నిశలు పుస్తకాలను ఔపాసన పట్టి నిరంతరము కష్టపడి చదివి ఉపాధ్యాయురాలు కావాలనే తన కలను నెరవేర్చుకుంది కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే పోటీ పరీక్షల్లో టీచర్ పోస్టు సాధించడం చాలా గొప్ప విషయమని పలువురు విద్యావంతులు, తిరుమల పాలెం గ్రామ ప్రజలు రాణిని అభినందించారు.

## జన నేతకు జన్మదిన శుభాకాంక్షలు



**పిట్టలవాని పాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** ఉపముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జనసేన సమన్వయ కర్త నమన వెంకట శివన్నారాయన ఒక నటుడిగా కోట్లాది హృదయాలను గెలిచి, ఒక నాయకుడిగా ప్రజాసేవకు అంకితమైన మీ ప్రస్థానం అభినందనీయం. ఎన్నో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచిన మీ పట్టుదల ప్రశంసనీయం. నారా చంద్రబాబు నాయుడు తో మీ స్నేహం కేవలం ఒక రాజకీయ కూటమి కాదు, ఇది ఆంధ్రప్రదేశ్ నవశకానికి నాంది పలికే ఒక పవిత్ర సంకల్పం. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించి, ఆశించిన అన్ని కలలు నెరవేరాలని ఆకాంక్షించారు. మీ లిభవిష్యత్ ప్రస్థానానికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. అనంతరం వ్యాధి గ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాదా, మాజీ రైల్వే బోర్డ్ మెంబెర్ నియాజి, చందోలు రూప శిల్పి మీరా, సలీం,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు

## కృష్ణా జిల్లా పర్యటనకు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

–స్వాగతం పలికిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్





**చల్లపల్లి (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరం వచ్చారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్నేహితుడు కంఠంనేని వెంకట రంగయ్య బాబు మాతృమూర్తి, ప్రముఖులు స్వర్గీయ కంఠంనేని బాబూ రాజేంద్ర ప్రసాద్ సతీమణి బసవ భారతి దేవి ప్రధమ వర్ధంతి సందర్భంగా రామానగరం వచ్చారు. భారతీ దేవీ చిత్రపటానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నివాళులు అర్పించారు. రంగయ్య బాబు, వారి సోదరి యార్లగడ్డ శారద దేవి - ఆయుష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ యార్లగడ్డ రమేష్ బాబు దంపతులు, మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు)లతో కొద్దిసేపు ఆత్మీయంగా సమావేశమై కుటుంబ విషయాలు చర్చించుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ నాయకులు యార్లగడ్డ అరవింద్, కేసీపీ శ్రీనివాసరావు, టీసీ అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, బోలెం సాయిబాబు, తహసీల్దార్ ద్రోణవల్లి వనజాక్షి, ఆర్ఐ కృష్ణమోహన్, లైజనింగ్ అధికారి హరీష్, సర్కిల్ ఎస్ఐలు, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ప్రాంత పర్యటనకు విచ్చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డికి మచిలీపట్నం జాతీయ కళాశాలలో హెలిపాడ్ వద్ద అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఓ.ఎస్.డీ. ప్రకాష్, మచిలీపట్నం ఆర్.డీ.ఓ కే.స్వాతి, తహసీల్దార్ మధుసూధనరావు, మాజీ ఎంపీపీ, పీఏసీఎస్ ఛైర్మన్ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు), టీసీ అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, బోలెం సాయిబాబు ఘనంగా స్వాగతం పలికారు.

## మూడు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్ల నియామకం

**అమరావతి,కలంకౌంటర్ :** నాలుగు బోధానాసుపత్రులకు సూపరింటెండెంట్ల నియామకం విజయనగరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ దేవి మాధవి అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ విజయశ్రీ మచిలీపట్నం జిజి హెచ్ సూపరింటెండెంట్ గా డాక్టర్ సౌమిని నియమాకాలకు ముఖ్యమంత్రి ఆమోదం ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జె. కిషోర్ ను పదోన్నతిపై పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్ గా నియామకం విజయనగరం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పల నాయుడును శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గా బదిలీ పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ విజయనగరం బోధనాసుపత్రి సూపరింటెండెంట్ గా బదిలీ నంద్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. మల్లీశ్వరి అనంతపురం జిజిహెచ్ సూపరింటెండెంట్ గా బదిలీ

## వైయస్సార్ వర్ధంతి లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుర్రా



**కందుకూరు,కలంకౌంటర్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కందుకూర్ తాసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి మాజీ శాసనసభ్యులు, కందుకూరు వైసిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, వైయస్ఆర్సీపీ నాయకులు తోకల కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న కొల్లు రవీంద్ర..





**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మోపిదేవిలో భక్తులచేత ప్రతిరోజూ విశేష పూజలు అందుకుంటున్న స్వయంభు దేవాలయం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ , గనులు & భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర ని ఆలయ సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ , ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్న అనంతరం మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారినీ దర్శించుకుని, ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు ఆలయ అర్చకులు స్వామివారికి సంబంధించిన విశిష్ట ఆర్చనలు, ఆశీర్వచనాలు అందించారు. తరువాత మంత్రి కొల్లు రవీంద్ర ని ఆలయ మర్యాదలతో సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ ఘనంగా సత్కరించి, ప్రసాదాలను అందజేశారు. అలాగే, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతలను ప్రశంసిస్తూ, ప్రజల అభ్యుదయానికి స్వామి కటాక్షం ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అన్నసంతర్పణలో పాల్గొన్న ఎం ఎల్ ఎ





**ఒంగోలు, కలంకౌంటర్:** ఒంగోలులోని 23వ డివిజన్ నందు అన్న సంతర్పణ కార్యక్రమం సందర్భంగా వినాయక విగ్రహం వద్ద పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, తెలుగుదేశం పార్టీ నాయకులు.

## ఆర్యవైశ్య జర్నలిస్టుల అసోసియేషన్ కు శుభాకాంక్షలు తెలిపిన దేవకి



**కనిగిరి, కలంకౌంటర్ :** పెనుగొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పాదాలు చెంత ఆగస్టు 31 వ తారీఖున నూతనంగా ఏర్పాటు అయిన ఆంధ్రప్రదేశ్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టు సంక్షేమ సేవా సంఘానికి ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య జర్నలిస్టులందరిని ఒక వేదిక పైకి తీసుకుని వచ్చిన కలంకౌంటర్ దినపత్రిక అధినేత సిహెచ్ రవికుమార్ ని అభినందించారు. ఇలా ఆర్యవైశ్యుల జర్నలిస్టులందరూ ఒక వేదిక మీదకి రావటం వలన పేద ఆర్యవైశ్య జర్నలిస్టులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ అసోసియేషన్ కు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా చీరెలు పంపిణీ





**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా జనసేన నాయకులు,ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు పేదలకు చీరెలు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో ఎంతో సువర్ణ అవకాశాలు ఉన్నప్పటికీ ప్రజలకు సేవ చేయడానికే తన జీవితాన్ని ఫణంగా పెట్టి నిజాయితీ,రాష్ట్ర ప్రజల అభివృద్ధి లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో వుండాలని భగవంతుడిని ప్రార్ధిస్తున్నట్లు తెలిపారు.

## ఆత్మకూరు ఇప్పటం రోడ్డులో గణపతికి 117 ప్రసాదాలు





**మంగళగిరి,కలంకౌంటర్ :** గుంటూరు జిల్లా మంగళగిరి పరిధి ఆత్మకూరు ఇప్పటం రోడ్డు 4వ లైన్ లో శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి సోమవారం రాత్రి 117 ప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు, మహిళలకు, పెద్దలకు క్విజ్, మ్యూజికల్ చైర్స్, హౌసీ, స్పూన్ అండ్ లెమన్... వంటి వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నృత్య, కోలాట ప్రదర్శనలు చేశారు. అందరూ ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి గణపతిని సందర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 3వ తేదీ బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు, విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ మూడు క్వింటాళ్ల బియ్యం విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. ఈ నెల 4వ తేదీ 9వ రోజు గురువారం వినాయక నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

## మాజీ సీఎం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం..



**పెద్దవరం,కలంకౌంటర్:** వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పెద్దవరం గ్రామ సర్పంచ్ గద్దె అప్పారావు అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు కార్యకర్తలు....



**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా రేపల్లె పట్టణంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్.**

–రేపల్లె,కలంకౌంటర్:

# ఎరువుల దుకాణాలలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు - జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్











**ఒంగోలు,కలంకౌంటర్ :**ప్రకాశం జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనుల నేపథ్యంలో ఎరువులు, పురుగుమందులకు ఉన్న అధిక డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని, కొంతమంది వ్యాపారులు యూరియా నిల్వలు చేసి బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో ముందస్తుగా జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమై ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. జిల్లా లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు , వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో మంగళవారం జిల్లాలోని మొత్తం 121 ఎరువుల దుకాణాలు, పలు ప్రదేశలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్టాక్ నమోదు, పీఓఎస్ (PoS)యంత్రాల్లో నమోదైన వివరాలు, పంపిణీ రిజిస్టర్లు, విక్రయ పత్రాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి, అవి బ్లాక్ మార్కెట్‌కి వెళ్లకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. దుకాణాల్లోని వాస్తవ నిల్వలు మరియు పీఓఎస్ యంత్రాల్లో నమోదైన స్టాక్ మధ్య తేడాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు, ఎరువుల నిల్వలు మరియు పంపిణీ విధానాలను నిశితంగా పరిశీలించారు. ప్రతి ఎరువుల దుకాణం తమ స్టాక్ వివరాలను పీఓఎస్ యంత్రంలో ఖచ్చితంగా నమోదు చేయాలని, వాస్తవ నిల్వలు మరియు రికార్డుల మధ్య ఎటువంటి తేడాలు ఉండకూడదని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తేడాలు ఉంటే, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పి (గరిష్ట చిల్లర ధర)కి మించి అదనంగా విక్రయించరాదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని, సహృదయంతో వ్యవహరించి వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని హితవు పలికారు. రైతులు మోసపోవకుండా ఉండేందుకు, ప్రతి ఎరువుల బస్తా విక్రయానికి రసీదు ఇవ్వాలని పోలీసు అధికారులు సూచించారు. ఎరువులు, పురుగుమందుల విషయంలో ఏవైనా అక్రమాలు జరిగినట్లు గమనిస్తే, వెంటనే ప్రజలు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రైతులకు పోలీసులు అండగా ఉంటామన్నారు. ఈ ఆకస్మిక దాడులు వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచేందుకు, బ్లాక్ మార్కెట్ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దోహదపడతాయని పోలీసులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో మీ సేవలు శ్లాఘనీయం - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం ,కలంకౌంటర్ :** సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా, ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన హెరీంగార్డులు కే.సూర్యనారాయణ , ఎం.వెంకట రామకృష్ణా రావు లను జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మనంగా సత్కరించి "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు విధులను ఎంతో సమర్ధవంతంగా నిర్వహించడం చాలా కష్టతరమన్నారు. అటువంటి విధులను నిర్వహించి, పోలీసుశాఖకు చేదోడు వాదోడుగా సుదీర్ఘ కాలం హెరీంగార్డుగా సేవలందించడం అభినందనీయమన్నారు. క్లిష్ట పరిస్థితులు, విభిన్న వాతావరణంలో విధులు నిర్వహించడంతో తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టలేని పరిస్థితులు ఉంటాయన్నారు. ఉద్యోగ విరమణ తరువాత ఇకపై తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉద్యోగ విరమణ చేసిన హెరీంగార్డుకు జిల్లా ఎస్పీ సూచించారు. ఉద్యోగ విరమణ చేస్తున్న కే.సూర్యనారాయణ పోలీసుశాఖలో హెరీంగార్డుగా 41నం.లు, ఎం.వెంకట రామకృష్ణా రావు 32 నం.లు పని చేసారన్నారు. విధి నిర్వహణలో రాత్రి గస్తీలు, బందోబస్తులు వంటి పోలీసు విధులను సమర్ధవంతంగా నిర్వహించారని వారి సేవలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కొనియాడారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన హెరీంగార్డు (1) కే.సూర్యనారాయణ (2) ఎం.వి.రామకృష్ణారావు దంపతులను జిల్లా పోలీసుశాఖ తరుపున ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, సాలువలతోను, పూల మాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను ప్రధానం చేసి, ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ చేసిన హెరీంగార్డు మాట్లాడుతూ తమ సర్వీసులో సహాయ, సహకారాలను అందించిన అధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆర్.రమేష్ కుమార్, ఇనార్జ్ హెచ్.సి.రాజు, ఉద్యోగ విరమణ చేస్తున్న హెరీంగార్డ్సు, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనాల్లో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం ,కలంకౌంటర్:** విజయనగరం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల నిమర్జన వేడుకల్లో ఎటువంటి అపశృతులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – గణేష్ ఉత్సవాల నిమర్జన వేడుకల్లో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా సంబంధిత పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీలు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నిమర్జనంకు వెళ్ళే మార్గంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు, నిమర్జన ఊరేగింపుల్లో డిజేలను వినియోగించేందుకు అనుమతులు లేవన్నారు. కావున, వేడుకలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలని, ఎటువంటి అశ్లీల నృత్యాలు నిర్వహించకుండా చూడాలన్నారు. నిమర్జన వేడుకల్లో మద్యం సేవించడం, కండ్లకు హానికలిగించే రంగులు జల్లుకోవడం, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. ఇతర మతస్థుల సంప్రదాయలను గౌరవించాలని, వారికి ఇబ్బందులు కలిగించకుండా సంయమనంతో వ్యవహరించాలని, మతసామరస్యాన్ని పాటించాలన్నారు. గణేష్ నిమర్జనం నిర్వహించే చెరువులు, నదులు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్ళను నియమించాలని, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. గణేష్ నిమర్జనం వేడుకల్లో ఎటువంటి అపశృతులు జరగకుండా డిఎస్పీలు పర్యవేక్షించాలని, సంబంధిత సిఐలు, ఎస్ఐలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.



తిరువూరు వైసిపి కార్యాలయంలో మాజీ సీఎం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం.. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నియోజకవర్గ ఇన్చార్జ్–నల్లగట్ల స్వామిదాస్.. అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు కార్యకర్తలు.

–తిరువూరు,కలంకౌంటర్:

## బంటుమిల్లి లో వైయస్సార్ వర్ధంతి




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలంలో వివిధ గ్రామాలలో అలాగే బంటుమిల్లి పట్టణంలో దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల నాగేశ్వరరావు సారధ్యంలో జరిగింది. బంటుమిల్లి పట్టణంలో గ్రామ పంచాయతీ వద్ద గల వైయస్సార్ విగ్రహానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు అలాగే వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలన ఆయన చేసిన సేవలు ప్రవేశపెట్టిన పథకాల గురించి పలువురు నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ముత్యాల నాగేశ్వరరావు మండలం పార్టీ మహిళా కన్వీనర్ పాము పుష్ప , బంటుమిల్లి ఎంపీటీసీ కమల్ భాష మాజీ మండల పార్టీ అధ్యక్షులు మలిశెట్టి రాజబాబు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు మరియు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు పలువురు పాల్గొన్నారు.

## కర్లపాలెం గ్రామస్తులకు అన్నివసతులతో కొత్త ఆర్ అండ్ ఆర్ కాలనీ - ఎమ్మెల్యే ఇంటూరి

**-353 మంది లబ్ధిదారులకు లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు**





**కందుకూరు,కలంకౌంటర్ :** గుడ్లూరు మండలం, మోచర్ల గ్రామం వద్ద రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామమైన కర్లపాలెం ప్రజలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త ఆర్ అండ్ ఆర్ కాలనీలో మంగళవారం ఉదయం లాటరీ ద్వారా 353 మంది లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు కార్యక్రమానికి సబ్ కలెక్టర్ దామెర హిమవంశి తో కలసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్లపాలెం గ్రామస్తులకు ఈరోజు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో ప్లాట్లు కేటాయించడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని, కాలనీలో అన్ని మౌలిక వసతులు ప్రభుత్వమే కల్పిస్తుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాన్ని ఆయన విమర్శిస్తూ %–% ఆవులవారి పాలెం, మొండివారిపాలెం గ్రామస్తుల కొరకు ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా చేతులు దులుపుకుందని, కనీసం స్మశానవాటిక స్థలాన్ని కూడా ఇవ్వలేకపోయింది. కానీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మశానవాటిక స్థలం కేటాయించి, మిగిలిన పనులను పూర్తి చేస్తున్నాం అని తెలిపారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే, డిపిఆర్ లో మౌలిక వసతులు లేని అంశాలు తమ దృష్టికి వస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆవులవారి పాలెం, మొండివారిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ప్లాట్ల పొజిషన్ సర్టిఫికెట్ల క్లియరెన్స్ ఇవ్వకపోవడం వల్ల ప్రజలకు బ్యాంకు లోన్లు రాక ఇబ్బంది అవుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించి క్లియరెన్స్ సర్టిఫికేట్ ఇవ్వాలని సబ్ కలెక్టర్ ని కోరారు. కర్లపాలెం నిర్వాసితుల కోసం అద్భుతమైన సదుపాయాలతో ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులి కి, మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి విజయభాస్కర్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కర్లపాలెం సర్పంచ్ చాపల రమణయ్యతో పాటు గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# జీవితం నవ్వుతూ నవ్విస్తూ ఉండాలి

● అమ్మ అంటే ప్రాణం ● బుల్లితెర యాక్టర్ నయన











**హైదరాబాద్,కలంకౌంటర్ :** జీవితం అంతా నవ్వుతూ నవ్విస్తూ ఉండాలి. ఎన్ని బాధలు వచ్చినా అధిగమించాలి. దేన్నీ ఆపలేం. మన కు అవకాశం ఉన్నంతవరకు హ్యాపీ గా ఉండాలి. ఏదైనా మంచి చేయగలిగితే చేయాలి అన్నది నా భావన అని విజయనగరం కశింకోట లో జన్మించి హైదరాబాద్ లో వృత్తి రీత్యా సెటిల్ అయిన బుల్లితెర నటి నయన అన్నారు. కలం కౌంటర్ దినపత్రిక ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంకా ఏమన్నారో ఆమె మాటల్లో చూద్దాం.

**అమ్మ అంటే ప్రాణం..** నా తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. మా పోషణ బాధ్యతలు అమ్మ చూసుకున్నారు. ఎన్నో కష్టాలు పడి పెంచారు. మధ్యతరగతి కుటుంబం మాది. నేను ఈ ఇండస్ట్రీలోకి రావడానికి అమ్మ ఆదరణే కారణం. భర్త సహకారం. అమ్మ చెప్పిందే వేదం. నేను నిలబడటానికి అమ్మ ఇచ్చిన సహకారం జన్మలో మరువలేను. మొదట జబర్దస్తు లో 20 ఎపిసోడ్ లు చేశాను. ఆ తర్వాత సీరియల్స్ లో అవకాశం వచ్చింది. 9 సీరియల్స్ లో నటించాను. ప్రస్తుతం గీత ఎల్ ఎల్ బి ,బ్రహ్మ ముడి ,చిన్ని సీరియల్స్ లో చేస్తున్నాను. నేను నటించిన అర్ధాంగి సీరియల్ కు మంచి ఆదరణ లభించింది. అర్ధాంగి టీమ్, గీత ఎల్ ఎల్ బి టీమ్ నా ఫ్యామిలీ తరహాలో భావిస్తాను. అలా సన్నిహితంగా కలిసిపోయారు.

**సీరియల్స్ చూసి...నేడు నటిస్తూ...** తాను ఒకప్పుడు చక్రవాకం, మొగిలి రేకులు సీరియల్స్ కంటిన్యూ గా చూసేదాన్ని. అనుకోకుండా నేడు సీరియల్స్ లో నటిస్తున్నాను. చాలా హ్యాపీ గా ఉంటుంది. ఈ ఇండస్ట్రీ లోకి రావాలనుకునే యువతులు ఎవరైనా ఆఫర్స్ ఇస్తానని చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దు. వాస్తవాలు విచారించుకుని నిర్ణయం తీసుకోండి. ఆ కంపెనీ గురించి విచారించుకోండి. లేదంటే ఇబ్బందులు పడుతారు. కెరీర్ పాడు చేసుకోవద్దు. సోషల్ మీడియా ను సద్వినియోగం చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది. చెడు కోసం సోషల్ మీడియా వాడొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను.

# కోరుకొండ మండలం ఆర్యవైశ్య సంఘం





కోరుకొండ మండలం ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్నిరామ సత్యనారాయణ , నుదురు మాటి శ్రీనివాస్ ,నారాయణ విశ్వేశ్వరరావు ,జిల్లా అధ్యక్షులు బత్తుల సత్యనారాయణ ,పేరూరు గాంధీ, మండవల్లి వెంకన్నబాబు ,రాజమండ్రి సుబ్బారావు, కొత్త కొండబాబు చలమయ్య, మండల అధ్యక్షుడిగా ఓలేటి సూర్యనారాయణ మూర్తి, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

–తూర్పుగోదావరి జిల్లా ,కలంకౌంటర్:

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





**తిరుపతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ 55వ జన్మదినాన్ని పురస్కరించుకొని తిరుపతిలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో.. బిసి హాస్టల్ నందు బర్త్డే కేకును కట్ చేసి, చిన్నారులకు బుక్స్, దుప్పట్లు, పెన్నులను పంచిపెట్టారు. అనంతరం అలిపిరి శ్రీవారి పాదాల చెంత వెయ్యి కొబ్బరికాయలు కొట్టి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని, వారికి అంతా మంచే జరగాలని శ్రీవారిని ప్రార్థించారు. తదుపరి మేటర్నిటీ హాస్పిటల్ లో ఉన్న బాలింతలకు పళ్ళు, బ్రెడ్ లు, దుప్పట్లను పంచిపెట్టారు. అలాగే రూయా హాస్పిటల్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ సమాజంలో మార్పు కోసం జనసేన పార్టీని స్థాపించారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మా అధినేత నిజాయితీకి, ప్రజాసేవకు నిలువెత్తు వ్యక్తిత్వం కలిగిన వారన్నారు. జనశ్రేణులందరి తరపున రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. సినిమాల్లోనే కాదు నిజజీవితంలో కూడా రియల్ హీరో మా పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. కౌలు రైతులకు, వరదలు వచ్చి రాష్ట్రం విపత్కర పరిస్థితులలో ఉన్నప్పుడు కోట్ల రూపాయలు తన సొంత కష్టార్జితాన్ని ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. పై కార్యక్రమాలలో.. తమ్మినేని వెంకటేశ్వరరావు, హరి శంకర్, దినేష్ జైన్, సానె శ్రీను, సుమన్ బాబు, ముక్కు సత్యవంతుడు, మధు బాబు, కేఎంకె లోకేష్, ఆకే పాటి సుభాషిణి, మునస్వామి, కీర్తన, వనజ, మార్కెట్ యువరాజ్, పగడాల మురళి, జీవన్, కోకిల, కొండా రాజమోహన్, మధులత, సాయి దేవ్, వినోద్, రుద్ర కిషోర్, మనోజ్, శ్రావణ్, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, శిరీష, చందు, దిలీప్, రమేష్ నాయుడు, దుర్గ, చందన, ప్రభాకర్ రెడ్డి, జానకిరామ్ రెడ్డి, రాధ, శివ, పవన్, పురుషోత్తం, సాయి, బాలాజీ, ఆది, శ్రావణ్, త్రిలోక్, అముదాల వెంకటేష్, ఆల్వార్ మురళి మరియు కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, దూది శివ, నరసింహ చారి, వరి కుంట్ల నారాయణ, సీకే రేవతి, తిరుత్తిని శైలజ, వేణు, బండ్ల లక్ష్మీపతి, సునీల్ చక్రవర్తి, బాలిశెట్టి కిషోర్, పవన్ కుమార్, సుధాకర్, శేషాద్రి, పవన్ ముఖేష్, జిన్నా బాషా, సలీమ్, మహేష్ , రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్పొరేటర్లు, వీరమహిళలు, జనసైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశంలోనే తొలిసారిగా... సీకే దిన్నె పాఠశాలలో స్మార్ట్ కిచెన్ ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

● రూ.2 కోట్ల వ్యయంతో 136 పాఠశాలలకు నాణ్యమైన భోజనం ● డిసెంబర్ నాటికి జిల్లాలో 33 కిచెన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి ● పనితీరును బట్టి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్న మంత్రి ● విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న లోకేశ్



(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలోని 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్‌లను ఏర్పాటు చేసి, 1,24,689 మంది విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. అనంతరం స్మార్ట్ కిచెన్‌ను సందర్శించిన ఆయన, వంటకు ఉపయోగిస్తున్న సరుకుల నాణ్యతను, తయారీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

**విద్యార్థులతో ముఖాముఖి... ఈసారి నాకూ పరీక్షే!..** అనంతరం మంత్రి లోకేశ్ పదో తరగతి క్లాస్ రూంను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. గత ఏడాది కాలంగా విద్యావ్యవస్థలో తెచ్చిన సంస్కరణలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్ విధానంలో పాఠ్యపుస్తకాలు ఇవ్వడం వల్ల పుస్తకాల మోత బరువు తగ్గిందని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు. సన్నబియ్యంతో భోజనం పెట్టడం వల్ల అన్నం చాలా రుచిగా ఉంటోందని క్లాస్ లీడర్ జాస్మిన్ చెప్పింది. ఈ సందర్భంగా పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్, కొత్త బెంచీలు కావాలని, కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలని విద్యార్థులు కోరగా, త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. కొత్తగా ఇచ్చిన యూనిఫాంలు, బ్యాగుల నాణ్యత బాగుందని, అయితే బ్యాగుల సైజు కొంచెం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని తాను గీసిన లోకేశ్ ముఖచిత్రాన్ని ఆయనకు బహూకరించింది. విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తవుతుంది. మీరంతా కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలి. ఈసారి పరీక్ష మీకు మాత్రమే కాదు, నాకు కూడా. విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని అన్నారు. తరగతి గదులను పరిశీలిస్తున్న సమయంలో గంగిరెడ్డి గణేశ్ రెడ్డి అనే విద్యార్థి నోట్‌బుక్‌లోని చేతిరాతను చూసి ముగ్ధుడైన లోకేశ్, ఆ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణితో సమావేశమైన మంత్రి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు సూచనలు కోరారు. ఉపాధ్యాయులపై పీటీఎం మినహా మరే ఇతర అదనపు భారాన్ని మోపడం లేదని, విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకుని నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. అక్కడికక్కడే పాఠశాలలో ఆర్వో తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ వెంట జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎమ్మెల్యేలు చైతన్య రెడ్డి, మాధవీరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు





**కనిగిరి,కలంకౌంటర్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 54వ పుట్టినరోజు సందర్భంగా కనిగిరిలో మంగళవారం రాష్ట్ర జనసేన నాయకులు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి వరికూటి నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరి చేతుల మీదుగా కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో పాటు పడుతున్నాడని, అలాంటి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జనసేన ఇన్చార్జి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంలో రాజకీయాల్లో ఎన్నో అవమానాలు కష్టనష్టాలు భరించి మొదటిసారి డిప్యూటీ సీఎం అయ్యి ప్రజలకు సేవ చేయటంలో తన సత్తా చాటుతున్నారని అన్నారు. దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం కనిగిరి మానసిక వికలాంగుల పాఠశాల నందు, వాసవి వృద్ధాశ్రమం నందు వృద్ధులకు, వికలాంగులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎలమందల రహీముల్లా,జిల్లా సంయుక్త కార్యదర్శి దేగల దొరస్వామి, ప్రోగ్రాం కన్వీనర్ సునీల్, మండల అధ్యక్షులు ఇండ్ల రమేష్, టౌన్ నాయకులు అంజి నాయుడు, నున్న శ్రీనివాసులు నాయుడు,మధు,నరేష్, దైవ, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

# జనసేనాని పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, కలంకౌంటర్ :** లింగసముద్రం మండలం లింగసముద్రం పంచాయతీలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు, యువ నాయకులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరై కేక్ కట్ చేసి, పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ, గత వైకాపా పాలనలో రాష్ట్రంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి, వైకాపా పాలనకు చరమగీతం పాడేందుకు, కూటమి ఏర్పాట్లలో చురుకైన పాత్ర పోషించి రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలకంగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మనసారా ఆకాంక్షిస్తున్నామని అన్నారు. ముందుగా ఎమ్మెల్యే కి జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు అంగులూరి నరసింహారావు, మండల అధ్యక్షుడు పూరిమెట్ల గురునాథం, గ్రామ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, పార్టీ నాయకులు బింకం శేషయ్య, బింకం నాగేంద్ర, అడపా నరసయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, కిలారి రమణయ్యతో పాటు యువత భారీగా పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com